క్లుప్తంగా

ఎరువుల సరఫరాలో అవకతవకలు జరిగితే చర్యలు


ప్రశాంతి, కలెక్టర్

సీటీఆర్ఐ: యూరియా, కాంప్లెక్స్ ఎరువుల సరఫరాలో అవకతవకలు జరిగితే కఠిన చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రశాంతి హెచ్చరించారు. ఆమె ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో సోమవారం సాయంత్రం ఎరువుల రిటైల్ డీలర్ల సమావేశం నిర్వహించారు. కలెక్టర్ మాట్లాడుతూ రాబోయే రబీ సీజన్‌కు అవసరమైన యూరియా, కాంప్లెక్స్ ఎరువులను ప్రభుత్వం సరఫరా చేసిందని, కానీ అవసరం లేకున్నా అధిక మొత్తంలో యూరియా కొనుగోలు చేసి నిల్వచేసుకుంటున్నారని ఆరోపణలు వస్తున్నాయన్నారు. అలాంటి పరిస్థితులను ఎట్టి పరిస్థితుల్లోనూ ఉపేక్షించబోమని హెచ్చరించారు. యూరియా ఒక్క బస్తాకు ప్రభుత్వం రూ.266 నిర్ణయించి సబ్సిడీతో ఇస్తోందని, వాస్తవ ధర రూ.2,300 పైగా ఉంటుందన్నారు. యూరియా దేశీయంగా ఉత్పత్తి కాదని, విదేశాల నుంచి దిగుమతి చేస్తున్నందు వల్ల జాతీయ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన అంశమన్నారు. కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ అధికారి ఎస్. మాధవ రావు, జిల్లా హార్టికల్చర్ అధికారి ఎన్. మల్లికార్జున రావు, పాల్గొన్నారు. కాగా.. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన పీజీఆర్ఎస్‌లో జేసీ చిన్నరాముడు 187 అర్జీలు స్వీకరించారు.

విద్యుత్‌కు నేడు అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: విద్యుత్ లైన్ల మరమ్మతుల కోసం మంగళవారం నగరంలోని పలు ప్రాంతాల్లో సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకూ మెయిన్ రోడ్డు, ఉల్లితోట వీధి, టి.నగర్, అజ్జరపువారి వీధి, బారువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, న్యాపతి వారి వీధి, గోదావరి బండ్ ఏరియాల్లో సరఫరా ఉండదన్నారు. = ఉదయం 10 నుంచి 2 గంటల వరకూ రాయడుపాకలు, కోలమూరు, కొంతమూరులోని పరిమి నగర్, బొమ్మన కాలనీ, ఫోర్త్ బ్రిడ్జి, సాయిరామ్ కాలనీ, వెంకటేశ్వర ప్లాస్టిక్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదన్నారు.

తెలుగు విశిష్టతను చాటుదాం

సీటీఆర్ఐ: తెలుగు భాష విశిష్టతను ప్రతి ఒక్క స్త్రీ చాటి చెప్పాలని ఎస్‌కేఆర్ డీఎడ్ కళాశాల తెలుగు విభాగాధిపతి పి.విశాలాక్షి అన్నారు. తెలుగు సరస్వతి పరిషత్, కళాగౌతమి నిర్వహిస్తున్న తెలుగు మాటల పండగ సోమవారం రాజమహేంద్రి కళాశాలలో జరిగింది. ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆమె మాట్లాడుతూ మాతృభాషకు విలువని ఇవ్వాలని, మన భాష సౌందర్య మాధుర్యాలను మర్చిపోరాదని ఆమె కోరారు. రాజమహేంద్రి కళాశాల ప్రిన్సిపాల్ సౌందర్య స్వరూప్ ఈ సభకు అధ్యక్షత వహించారు.

45 మద్యం సీసాల పట్టివేత

కంబాలచెరువు: అక్రమంగా నిల్వ ఉంచిన 45 మద్యం బాటిళ్లను టూటౌన్ పోలీసులు సోమవారం పట్టుకున్నారు. పోలీసులకు రాబడిన ముందస్తు సమాచారం ప్రకారం ఆల్కాట్ తోటలలోని అశోక్ స్ట్రీట్‌లో మింది గణేష్‌పై దాడి చేశారు. అతడి వద్ద సుమారు రూ.8 వేలు విలువైన మద్యం బాటిళ్లను స్వాధీనం చేసుకున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

ప్రేమ్‌కుమార్ మాస్టర్ చిరస్మరణీయుడు

రాజమహేంద్రవరం రూరల్: విద్యార్థులను ఆకట్టుకునేలా బోధన చేసిన ఈఎస్ ప్రేమ్‌కుమార్ మాస్టార్ చిరస్మరణీయుడు అని బొమ్మూరులోని జీపీఆర్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఎం.నరసింహారెడ్డి అన్నారు. ఈ పాఠశాల లో సోషల్ అసిస్టెంట్‌గా పనిచేసి గత సంవత్సరం ఆగస్టు 25న మృతి చెందిన ప్రేమ్‌కుమార్ మాస్టర్ సంస్మరణ కార్యక్రమం సోమవారం పాఠశాల అసెంబ్లీలో నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పుష్పాంజలి ఘటించారు. ఈ సందర్భంగా రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు, పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి

కంబాలచెరువు: కాకినాడ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందాడు. టూటౌన్ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఒడిశాకు చెందిన దిల్‌కస్ షబర్ (30) కూలి పని చేసుకునేందుకు రాజమహేంద్రవరం వచ్చాడు. అయితే కొద్ది రోజుల క్రితం గోదావరి గట్టుపై ఉన్న కరెంట్ ఆఫీసు వద్ద ఆటో ఢీకొని గాయపడ్డాడు. అతడిని ప్రభుత్వాసుపత్రిలో చేర్పించగా బ్రెయిన్‌లో తేడా వచ్చి పరిస్థితి విషమించింది. దీంతో కాకినాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతిచెందాడు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చవితి వేడుకలపై సమీక్ష

కడియం: వినాయక చవితిని సంప్రదాయబద్ధంగా నిర్వహించుకోవాలని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. మండలంలో జరగనున్న ఉత్సవాలపై వివిధ శాఖలతో సోమవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో సమీక్షించారు.

అర్జీల పరిష్కారానికి చర్యలు

రాజమహేంద్రవరం సిటీ: ప్రజా సమస్యల పరిష్కార వేదికకు వచ్చే అర్జీలకు నాణ్యతతో పరిష్కారం చూపాలని సంబంధిత అధికారులను అడిషనల్ కమిషనర్ పీవీ రామలింగేశ్వర్ ఆదేశించారు. సోమవారం నగరపాలక సంస్థ కార్యాలయంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వివిధ సమస్యలపై 23 వినతులు స్వీకరించారు.

రోడ్డు ఛిద్రం.. ప్రయాణం భయం

- యథేచ్ఛగా భారీ వాహనాల రాకపోకలు
- గోతులు పడుతున్న రోడ్డు
- వాహన చోదకుల అవస్థలు


రోడ్డుపై ప్రయాణిస్తున్న భారీ వాహనం


ప్రయాణికులను భయపెడుతున్న గోతులు


హుకుంపేట వద్ద జాతీయ రహదారి నుంచి బాలాజీపేట రోడ్డులో ఏర్పడిన గోతులు

రాజమహేంద్రవరం రూరల్: ఆ రోడ్డులో గ్రావెల్, ఇసుక లారీలు నిత్యం యథేచ్ఛగా రాకపోకలు సాగిస్తున్నాయి. వీటి కారణంగా ఆ రోడ్డు గోతులమయంగా మారింది. అధికారులు మరమ్మత్తులు చేపట్టినప్పటికీ భారీ వాహనాల కారణంగా మళ్లీ యథాస్థితికి చేరుతోంది. ఈ రోడ్డులో ప్రయాణానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హుకుంపేట జాతీయ రహదారి నుంచి తూర్పు రైల్వేస్టేషన్ వైపునకు వెళ్లే ఆర్‌అండ్‌బీ రహదారి పరిస్థితి ఇది.

గత పుష్కరాలకు..

గత పుష్కరాల సమయంలో హుకుంపేట జాతీయ రహదారి నుంచి బాలాజీపేట వరకూ ఆర్ అండ్ బీ రహదారిని అభివృద్ధి చేశారు. అప్పటి నుంచి కొంత కాలం ఈ రోడ్డు పరిస్థితి బాగానే ఉండేది. తర్వాత కాలంలో ఇసుక, గ్రావెల్ లారీలు అతి వేగంగా, భారీ లోడుతో వెళ్లడంతో క్రమంగా గోతులు పడి కుంగిపోతోంది. మొదట్లో చిన్నగా ఉన్న గోతులు ఇప్పుడు చాలా పెద్దవిగా మారాయి. ఈ రహదారిపై ప్రయాణానికి వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

మరమ్మతులు చేసినా.. ..

భారీ వాహనాల రాకపోకలతో రోడ్డు ఛిద్రమై గోతులమయంగా మారింది. గోతులు పడిన చోట ఆర్‌అండ్‌బీ అధికారులు మరమ్మత్తులు చేసినప్పటికీ కొద్దిపాటి వర్షం వస్తే చాలు రోడ్డు బీటలు తీసి తద్వారా గోతులు ఏర్పడుతున్నాయి. ఇక వర్షం కురిస్తే పరిస్థితి మరీ అధ్వానంగా మారుతోంది. ఈ రోడ్డులోని ఆవ కాలువపై కల్వర్టు నిర్మించడంతో భారీ వాహనాలు రాకపోకలు భాగా పెరిగిపోయాయి. వీటిని నిషేధిస్తే తప్ప ఈ రహదారికి భద్రత ఉండదని వాహన చోదకులు వాపోతున్నారు.

చర్యలు తీసుకోవాలి

హుకుంపేట జాతీయ రహదారి నుంచి బాలాజీపేట వరకూ ఉన్న రోడ్డు భారీ వాహనాల రాకపోకలతో దెబ్బతింటోంది. దీనివల్ల వాహన చోదకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి భారీ వాహనాల రాకపోకలు తగ్గేలా చర్యలు తీసుకోవాలి.

– కొవ్వూరి ధర్మారెడ్డి, సామాజిక సేవకుడు, హుకుంపేట

బాధితుడికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందజేస్తున్న అసోసియేషన్ సభ్యులు

సీటీఆర్ఐ: కోరుకొండలోని వెంకట సత్య సప్లయి కంపెనీలో ఇటీవల అగ్ని ప్రమాదం జరిగింది. దానిలో సామగ్రి కాలిపోవడంతో యజమాని ఎం.నరసింహారావు తీవ్రంగా నష్టపోయారు. ఈ ఘటనపై రాజమండ్రి సౌండ్ అండ్ లైటింగ్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ స్పందించింది. నరసింహారావును ఆదుకునేందుకు అసోసియేషన్ సభ్యులు ముందుకు వచ్చారు. ఈ నేపథ్యంలో రూ.23,616తో పాటు రూ.12,500 ఖరీదు చేసే 50 కొత్త హ్యాండ్ లెస్ ప్లాస్టిక్ కుర్చీలను సోమవారం స్థానిక అసోసియేషన్‌లో నరసింహారావుకు అందజేశారు. కార్యక్రమంలో అధ్యక్షుడు గుల్లిపల్లి వెంకటేశ్వరరావు, సెక్రటరీ వసంత్ కుమార్, గౌరవాధ్యక్షుడు బొట్ల సూర్యారావు, ట్రెజరర్ బెజవాడ రామారావు, కర్రల సత్తిబాబు, ఎం.ప్రకాశరావు పాల్గొన్నారు.

స్మార్ట్ కార్డుల పంపిణీలో బీసీ, ఎస్సీలపై వివక్ష


ఆర్డీవో కార్యాలయంలో ఫిర్యాదు చేస్తున్న సర్పంచ్ స్టాలిన్


జేగురుపాడులోని ప్రైవేటు స్థలంలో స్మార్ట్ కార్డుల కోసం వేచి ఉన్న గ్రామస్తులు

కడియం: ప్రభుత్వం కొత్తగా సిద్ధం చేసిన రేషన్ స్మార్ట్ కార్డుల పంపిణీలో ఎస్సీ, బీసీలపై అధికారులు వివక్ష చూపుతున్నారని జేగురుపాడు సర్పంచ్, వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు యాదల సతీష్‌చంద్రస్టాలిన్ అన్నారు. ఆయన సోమవారం స్థానిక విలేకరులతో మాట్లాడారు. ఈ కార్డుల పంపిణీని గ్రామ సచివాలయం వద్ద కాకుండా ప్రైవేటు స్థలంలో ఇస్తున్నారని, అంతే కాకుండా సర్పంచ్‌నైన తనకు ఆహ్వానం లేదన్నారు. అలాగే గ్రామంలోని ఎస్సీ, బీసీలకు ఎటువంటి సమాచారం లేదని తెలిపారు. ప్రైవేటు వ్యక్తుల స్థలంలో చేస్తున్న కార్డుల పంపిణీ విషయాన్ని గ్రామస్తులు తన దృష్టికి తీసుకురాగా, తాను స్వయంగా అక్కడకు వెళ్లానన్నారు. కార్యక్రమాన్ని నడిపించాల్సిన వీఆర్వో శివకృష్ణ అక్కడ లేరన్నారు. దీంతో ఆయనకు ఫోన్ చేసి నిబంధనల ప్రకారం సచివాలయంలో ఇవ్వాలని, ఫొటోకాల్ ప్రకారం తనకు సమాచారం ఇవ్వాలని, కానీ ఎందుకు ఇవ్వలేదని ప్రశ్నించినప్పటికీ సమాధానం లేదన్నారు. ఎస్సీ, బీసీలను అవమానపరిచే విధంగా వ్యవహరిస్తున్న ఇటువంటి అధికారుల తీరును స్టాలిన్ తప్పుపట్టారు. అలాగే ఆర్డీవో కార్యాలయంలో ఈ మేరకు లిఖిత పూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు స్టాలిన్ చెప్పారు. ప్రభుత్వ కార్యాక్రమాలు నిర్వహించే అధికారులు అన్ని కులాలకు సమాన ప్రాధాన్యం ఇవ్వాలని, అంతేగానీ కులాల మధ్య ఘర్షణలకు దారితీసే విధంగా వీఆర్వో వ్యవహరించడం దారుణమని ఆ ఫిర్యాదులో పేర్కొన్నారు. తక్షణం అతడిపై చర్యలు తీసుకోవాలని స్టాలిన్ కోరారు.

గోదావరి మాతకు పేరంటం


గోదావరి మాతకు పేరంటం ఇస్తున్న విజయలక్ష్మి తదితరులు

సీటీఆర్ఐ: తెలుగు సంప్రదాయాలను, ఆచారాలను కాపాడుకోవాలని వైఎస్సార్ సీపీ నాయకురాలు జక్కంపూడి విజయలక్ష్మి అన్నారు. తెలుగు సారస్వత పరిషత్, కళా గౌతమి ఆధ్వర్యంలో తెలుగు మాటలు పండగ వేడుకలను నాలుగు రోజులుగా నిర్వహిస్తున్నారు. అందులో భాగంగా సోమవారం పుష్కర ఘాట్ వద్ద తెలుగు పేరంటం నిర్వహించారు. ఈ సందర్భంగా గోదావరి మాతకు విద్యార్థుతో తొలి పేరంటం ఇప్పించారు. కాళ్ల భైరవ సంస్థాన పీఠం అధ్యక్షుడు శివస్వామి చేతుల మీదుగా ఈ కార్యక్రమం జరిగింది. డాక్టర్ శ్రీదేవి, పి.విశాలాక్షి, ఆర్‌కే లత, బర్ల సీతారత్నం, రాణి పాల్గొన్నారు.

పుష్కర ఘాట్‌లో 'శుభంకర మహా గణపతి'


సమావేశంలో మాట్లాడుతున్న రాజమహేంద్ర గణేష్ ఉత్సవ కమిటీ అధ్యక్షురాలు జక్కంపూడి విజయలక్ష్మి

సీటీఆర్ఐ: పుష్కరఘాట్‌లో ఈ ఏడాది శుభంకర మహాగణపతిని ఏర్పాటు చేయనున్నట్టు రాజమహేంద్రి గణేష్ ఉత్సవ కమిటీ నిర్వాహకురాలు జక్కంపూడి విజయలక్ష్మి వెల్లడించారు. స్థానిక పుష్కర ఘాట్‌లో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఆమెతో పాటు కమిటీ ప్రతినిధులు చల్లా శంకరరావు, పాలసానపల్లి హనుమంతరావు, బైర్రాజు ప్రసాదరాజు, నందెపు శ్రీనివాస్ ఉన్నారు. విజయలక్ష్మి మాట్లాడుతూ 2010లో జక్కంపూడి రామ్మోహనరావు వ్యవస్థాపకుడిగా రాజమహేంద్రి గణేష్ ఉత్సవ సమితిని ఏర్పాటు చేసి గణపతి నవరాత్రులు మొదలు పెట్టామన్నారు. ఈ ఏడాది 16వ వార్షిక ఉత్సవాల్లో భాగంగా 18 అడుగులు ఎత్తయిన శుభంకర మహా గణపతి విగ్రహాన్ని నూలు పోగులు, పసుపు తాడుతో రూపొందిస్తున్నామన్నారు. స్త్రీ రూపంలో గణపతిని ప్రతిష్ఠ చేస్తున్నామన్నారు. ఈ నెల 27వ తేదీ ఉదయం గణపతి హోమంతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 7వ తేదీన ఉదయం నిమజ్జనం, అనంతరం నూలు పోగుల వితరణ ఉంటుందని తెలిపారు. నందెపు శ్రీనివాస్ మాట్లాడుతూ ఏటా మాదిరిగానే ఎస్వీ మార్కెట్‌లోని శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామిని ఇక్కడకు తీసుకొచ్చి సెప్టెంబర్ 2న కల్యాణం జరిపిస్తామన్నారు. సమావేశంలో కొమ్ముల సాయి, వాకచర్ల కృష్ణ, పిచ్చుక సత్యనారాయణ, నిడిగట్ల బాల్జీ, కరుణామయుడు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

చిత్రలేఖనం పోటీలు

కంబాలచెరువు: అంతరిక్ష దినోత్సవం సందర్భంగా ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం విద్యార్థులకు చిత్రలేఖనం పోటీలు నిర్వహించారు. ఇన్‌స్పైర్ సైన్యస్ సదస్సు సందర్భంగా జాతీయస్థాయి ఉపాధ్యాయ శిక్షణ మెంటార్ మేకా సునత్య రేఖ చేతుల మీదుగా విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయుడు ఎంవీఎం.సుబ్రహ్మణ్యం, డ్రాయింగ్ ఉపాధ్యాయుడు పుప్పాల బాపిరాజు, ప్రెస్ క్లబ్ ప్రెసిడెంట్ పార్థసారథి పాల్గొన్నారు.

కబడ్డీ కథాంశంతో 'అర్జున్ చక్రవర్తి'


విలేకరులతో మాట్లాడుతున్న హీరో విజయ రామరాజు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): కబడ్డీ కథాంశంతో రూపొందించిన అర్జున్ చక్రవర్తి సినిమా ఈ నెల 29న విడుదల కాబోతోందని హీరో విజయ రామరాజు అన్నారు. విక్రాంత్ రుద్ర దర్శకత్వంలో రూపొందిన ఆ సినిమా ప్రమోషన్‌లో భాగంగా చిత్ర యూనిట్ సోమవారం రాజమహేంద్రవరం వచ్చింది. ఈ సందర్భంగా నగరంలోని ఓ హోటల్లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హీరో విజయ రామరాజు మాట్లాడుతూ లోకం గుర్తించిన గొప్ప కబడ్డీ చాంపియన్ కథే అర్జున్ చక్రవర్తి అన్నారు. హీరోయిన్ సిజా రోజ్, సీనియర్ నటుడు దయ తదితరులు పాల్గొన్నారు.

సైన్స్ ఉపాధ్యాయులకు అవగాహన

కంబాలచెరువు: విద్యార్థుల్లో శాస్త్రీయ దక్పథాన్ని పెంపొందించేందుకు ఇన్‌స్పైర్ ప్రదర్శన దోహద పడుతుందని జిల్లా సమగ్ర శిక్ష ఏఎంవో గౌరీ శంకరరావు అన్నారు. స్థానిక ఎస్‌కేవీటీ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో సోమవారం రాజమహేంద్రవరం డివిజన్ పరిధిలోని అన్ని యాజమాన్యాల ఉన్నత, ప్రాథమికోన్నత పాఠశాలల సైన్స్ ఉపాధ్యాయులకు ఇన్‌స్పైర్ ప్రదర్శనపై ఓరియంటేషన్ కార్యక్రమం జరిగింది. దీనికి హాజరైన జిల్లా సైన్స్ అధికారి జీవీఎస్ఎస్ నెహ్రూ మాట్లాడుతూ ఉన్నత పాఠశాల నుంచి ఐదు ప్రాజెక్టులు, ప్రాథమిక ఉన్నత పాఠశాల నుంచి మూడు ప్రాజెక్టులు విధిగా సబ్మిట్ చేయాలన్నారు. ప్రతి విద్యార్థికి వ్యక్తిగత బ్యాంకు ఖాతాను ఓపెన్ చేయాలన్నారు. విషయ నిపుణుడు, విశ్రాంత సైన్స్ ఉపాధ్యాయులు బసవరాజు మాట్లాడుతూ ఆసక్తిని కలిగించే సైన్స్ ప్రాజెక్టులు తయారు చేయాలన్నారు. ఇన్నోవేటివ్ ఐడియాలతోనే ఇన్‌స్పైర్ ప్రాజెక్టులు రూపొందించాలన్నారు.

నేడు జాబ్ మేళా

ధవళేశ్వరం: గ్రామంలోని వివేకానంద ఐటీఐ ప్రాంగణంలో మంగళవారం మెగా జాబ్ మేళా నిర్వహించనున్నట్లు జిల్లా ఉపాధి అధికారి కె.హరీష్ చంద్రప్రసాద్, జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి వి.గణేష్ మురళి తెలిపారు. సుమారు పది ప్రముఖ కంపెనీల్లో వివిధ ఉద్యోగాలలో పని చేయడానికి 10వ తరగతి, ఐటీఐ, డిగ్రీ పాస్ లేదా ఫెయిల్ అయిన 19 నుంచి 35 ఏళ్లలోపు వారు అర్హులన్నారు. అన్ని సర్టిఫికెట్లతో ఉదయం 10 గంటలకు హాజరుకావాలన్నారు.

కరాటేలో విద్యార్థుల సత్తా

ప్రకాశం నగర్: కోల్‌కతాలోని నేతాజీ ఇండోర్ స్టేడియంలో జరిగిన 9వ అంతర్జాతీయ కరాటే చాంపియన్ షిప్‌లో నగరానికి చెందిన పలువురు విద్యార్థులు పతకాలు సాధించారని కరాటే మాస్టార్ పిల్లి అరుణ్ కుమార్ సోమవారం ప్రకటనలో తెలిపారు. అండర్ –14కు సంబంధించి 40 కేజీల విభాగంలో టి.గణేష్, 35 కేజీల విభాగంలో ఎస్.నిఖిలేష్, అండర్ –17కు సంబంధించి 48 కేజీల విభాగంలో కావ్యశ్రీ, 45 కేజీల విభాగంలో పి.పూజ, అండర్ –19లో 55 కేజీల విభాగంలో లక్ష్మీభవాని బంగారు పతకాలు సాధించారన్నారు. అండర్ –14లో 32 కేజీల విభాగంలో కె.లాస్య, అండర్ –19లో శ్రీలక్ష్మీలత, అండర్ –14లో 48 కేజీల విభాగంలో సహస్ర రేఖ వెండి పతకాలు గెలుచుకున్నారన్నారు.

సువర్ణ వర్తక సంఘానికి గొప్ప చరిత్ర



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అడపా శ్రీహరి

రాజమహేంద్రవరం సిటీ: స్వాతంత్ర్యం రాక పూర్వమే 1933లో ఏర్పడిన రాజమండ్రి సువర్ణ వర్తక సంఘానికి 92 ఏళ్ల ఘన చరిత్ర ఉందని ఆ సంఘ అధ్యక్షుడు అడపా శ్రీహరి, సంఘ గౌరవ అధ్యక్షుడు కూర్మదాసు ప్రభాకర్, గౌరవ కార్యదర్శి గంటా ప్రకాష్ తెలిపారు. సోమవారం శ్రీ సువర్ణ వర్తక సంఘ కల్యాణ మండపంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. కొద్ది రోజులుగా మాజీ పూర్వ అధ్యక్షుడు కడియాల శ్రీనివాస్ ఈ వర్తక సంఘం తనదని, ఇప్పుడున్న సంఘ కమిటీ ఆ ప్రజాస్వామికం అంటూ సంఘాన్ని, సంఘ పెద్దలను, సభ్యులను కించపరిచే విధంగా ప్రకటనలు ఇవ్వడం శోచనీయమన్నారు. పదవీ కాలపరిమితి పూర్తయ్యాక సంఘానికి సంబంధించిన మినిట్స్ బుక్ యావత్తు రికార్డు, జమా ఖర్చులు సంఘానికి అప్పజెప్పాల్సి ఉండగా ఆ విధమైన పని మాజీ అధ్యక్షుడు శ్రీనివాస్ చేయలేదన్నారు. 2019లో సర్వసభ్య సమావేశానికి హాజరు కాకుండా, మాకు లాయరు నోటీసులు పంపించారని, ఇటువంటి సంఘ వ్యతిరేక చర్యలను గర్తిస్తూ, తదుపరి సర్వసభ్య సమావేశంలో అతడిని సభ్యుల ఏకగ్రీవ తీర్మానంతో సంఘం నుంచి బహిష్కరించినట్లు అడపా శ్రీహరి తెలిపారు. కూర్మదాసు ప్రభాకర్ మాట్లాడుతూ సంఘ పెద్దల పైనా రూ.కోట్లు దుర్వినియోగం జరిగినట్లు ఆరోపణలు చేయడం దారుణమన్నారు. తన మీద చేసిన ఆరోపణలకు ఏడు రోజుల లోపు సమాధానం చెప్పాలని లేకుంటే, తాము తీసుకునే సివిల్, క్రిమినల్ చర్యలకు సిద్ధంగా ఉండాలని హెచ్చరించారు. కార్యక్రమంలో సంఘ ప్రతినిధులు వెత్సా బాల్జీ, కృష్ణదాస్ జవ్వార్, దొండపాటి జయసింహ, బొడ్డు రామారావు, సప్పా వెంకట రమణ, కొనగళ్ల రాజు, ఎస్ఎస్‌వీ ప్రసాద్, కడియాల రఘు తదితరులు పాల్గొన్నారు.

మట్టి గణపతి ప్రతిమల పంపిణీ

ప్రకాశం నగర్: ఎకో ఫ్రెండ్లీ గణేశా నినాదంతో సోమవారం స్థానిక 9వ డివిజన్ వెంకటేశ్వర నగర్ వాకర్స్ పార్కు వద్ద ముసిని బాబూరావు ఆధ్వర్యంలో మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేశారు. మాజీ మేయర్ ఆదిరెడ్డి వీరరాఘవమ్మ, శ్యామ్ సింగ్, కె.అనిల్, ధర్నాల దొరబాబు, ముసిని వెంకటేశ్వరావుల చేతుల మీదుగా సుమారు 1500 మందికి మట్టి ప్రతిమలతో పాటు పూజా గొడుగు, తదితర వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ముసిని బాబూరావు మాట్లాడుతూ పర్యావరణ పరిరక్షణకు మట్టి గణపతినే పూజించాలన్నారు.


మట్టి గణపతి ప్రతిమలను పంపిణీ చేస్తున్న ముసిని బాబూరావు తదితరులు


మానవత ఆధ్వర్యంలో మట్టి వినాయక ప్రతిమల పంపిణీ

మానవత ఆధ్వర్యంలో..

రాజమహేంద్రవరం సిటీ: వినాయక చవితి సందర్భంగా మట్టి ప్రతిమల పంపిణీ చేపట్టినట్లు మానవత అధ్యక్షుడు బూరగడ్డ మురళీ తెలిపారు. సోమవారం సీపీ రెడ్డి మోటార్స్ అధినేత, మానవత సేవాసంస్థ రీజనల్ చైర్మన్ చింతా ప్రసాద్ రెడ్డి సహకారంతో మట్టి వినాయక ప్రతిమలు, తులసి విత్తనాలు పంపిణీ చేశారు. మురళీ మాట్లాడుతూ పూజ అనంతరం విగ్రహాన్ని తులసి విత్తనాలతో కలిసి మన తోటలోనో, పూల కుండీలోనో ఉంచితే ఆ విగ్రహం మట్టి నుంచి మొక్కలు వస్తాయన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ విశ్వనాథం, ట్రెజరర్ రాంబాబు, కార్యనిర్వాహక కమిటీ సభ్యులు పాల్గొన్నారు.